క్లుప్తంగా

సామాజిక మాధ్యమాలతో సమస్యలు తెచ్చుకోవద్దు



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్సై కాంతిప్రియ

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): సామాజిక మాధ్యమాలతో సమస్యలు కొనితెచ్చుకోవద్దని ఏలూరు మహిళా పోలీస్‌ స్టేషన్‌ ఎస్సై వి.కాంతి ప్రియ సూచించారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం మధ్యాహ్నం అంతర్జాతీయ మహిళా హింసా నిరోధక దినోత్సవం సందర్భంగా కళాశాల ఎన్‌ఎస్‌ఎస్‌ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన కాంతి ప్రియ మాట్లాడుతూ నేటి సమాజంలో స్త్రీలు వివిధ రకాలుగా ఎదుర్కొంటున్న హింసలను, వాటిని నిరోధించే విధానాలను వివరించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్‌ గుత్తా గిరిబాబు మాట్లాడుతూ సమాజంలో సగభాగమైన మహిళల పట్ల వ్యవహరించాల్సిన తీరును వివరించారు. మహిళాభ్యున్నతే దేశాభ్యున్నతిగా కొనియాడారు. మహిళలను హింసించడం నేరమన్నారు. కళాశాల వైస్‌ ప్రిన్సిపాల్‌ ఎం రాంబాబు, ఎస్‌ సుశీలత ప్రసంగించారు. కార్యక్రమంలో వివిధ విభాగాల అధ్యాపకులు వి.వెంకట్రావు, ఎస్‌ పరమేశ, ఎం విజయ్‌ కుమార్‌, టి.వెంకట దుర్గాప్రసాద్‌, డి.సుజాత తదితరులు పాల్గొన్నారు.

జైభీమ్‌ ఆర్మీ నూతన కమిటీ ఎన్నిక



రాము, సుధీర్‌లకు నియామకపత్రాలను అందిస్తున్న నరేష్‌ బాబు

ఏలూరు (టూటౌన్‌): జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు పెంపుదల చేయాలని జైభీమ్‌ ఆర్మీ వ్యవస్థాపక అధ్యక్షుడు గొల్ల నరేష్‌ బాబు, కార్యదర్శి నిడిగట్టి సుధీర్‌ బాబు కోరారు. స్థానిక పత్తేబాదలోని జైభీమ్‌ ఆర్మీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఏలూరు జిల్లా నూతన కమిటీని నియమించారు. అధ్యక్షునిగా బంకపల్లి రాము, ఉపాధ్యక్షునిగా పులిదిండి సుధీర్‌లను నియమిస్తూ నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల ప్రాతినిధ్యం పెరిగిందన్నారు. 75 ఏళ్ల నాటి రిజర్వేషన్లనే నేటికీ అమలు చేస్తున్నారని గుర్తుచేశారు. అన్ని శాఖలలో రిజర్వేషన్లు పెంచాలని డిమాండ్‌ చేశారు. కార్యక్రమంలో కె.పవన్‌, ఎస్‌.జోజి, టి.వంశీ, ఎస్కే గౌసి, బి.నాగరాజు, ఎస్కే నజీర్‌, ఎం టోని, ఎస్కే సౌజు, ఎం నిఖిల్‌ తదితరులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా ఆక్రమణలు.. ట్రాఫిక్‌ ఇక్కట్లు

- డ్రెయిన్లపైనే వ్యాపారాలు
- వాహనచోదకులకు ఇబ్బందులు
- పట్టించుకోని నగరపాలక సంస్థ అధికారులు
- ఏలూరు వన్‌టౌన్‌లోని దుస్థితి



వ్యాపారాలతో కుచించుకుపోయిన కుండీ సెంటర్‌ నుంచి గడియారస్తంభం సెంటర్‌కు వెళ్లే రహదారి

ఏలూరు (టూటౌన్‌): ఏలూరు వన్‌టౌన్‌ ప్రాంతంలో ఇరుకు రోడ్లు, వంకర టింకర సందులకు తోడు డ్రెయిన్లపైనే వ్యాపారాలు చేస్తుండడంతో నిత్యం ట్రాఫిక్‌ సమస్యలు తలెత్తుతున్నాయి. ద్విచక్రవాహనంపై వెళ్లాలన్నా ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. ఏలూరు 11, 12, 13, 14 డివిజన్‌ పరిధిలో ఈ సమస్య ఎక్కువగా ఉంది. ప్రజాప్రతినిధుల అండదండలతో ఏలూరు నగరం పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా భవన నిర్మాణాలు చేస్తుండడంతో సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఏదైనా సమస్యపై అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదులు చేస్తున్నా పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు.

తరచూ ప్రమాదాలు

ఏలూరు కార్పొరేషన్‌ పరిధిలోని 11వ డివిజన్‌ శనగపప్పు బజార్‌ నుంచి పోణంగి వెళ్లే ప్రధాన రోడ్డు ఇరుకుగా ఉండడం, టర్నింగ్‌ ప్రాంతంలో రోడ్డు మార్జిన్‌ లేకుండా డ్రెయినేజీ పైనే వ్యాపారాలు చేస్తుండటంతో స్థానికులకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. టర్నింగ్‌ రోడ్డులో డ్రెయినేజీకి ఆనుకుని కమర్షియల్‌ కాంప్లెక్స్‌ నిర్మించి, ఫాస్ట్‌ఫుడ్‌ సెంటర్‌ నిర్వహిస్తుండటంతో ఈ మార్గంలో తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయని వాహనచోదకులు వాపోతున్నారు. మలుపు కావడంతో ఎదురెదురుగా వచ్చే వాహనాలు కన్పించకపోవడంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయని భయాందోళన చెందుతున్నారు. సాధారణంగా రోడ్డును ఆనుకుని కొంత ఖాళీ స్థలం వదిలి డ్రెయినేజీ నిర్మిస్తారు. ఒక వేళ ఖాళీ స్థలం లేకపోతే రోడ్డును ఆనుకుని డ్రెయినేజీని నిర్మిస్తారు. ఇటువంటి పరిస్థితుల్లో డ్రెయినేజీని ఆనుకుని దాదాపు 8 అడుగుల మార్జిన్‌ వదలాల్సి ఉంటుంది. ఇవన్నీ పరిశీలించాకే బిల్డింగ్‌ నిర్మాణానికి అధికారులు ప్లాన్‌ అప్రూవల్‌ చేయాల్సి ఉంటుంది. ఐతే ఇవేమీ ఇక్కడ పట్టించుకోలేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



శనగపప్పు బజార్‌ టర్నింగ్‌లో డ్రెయిన్‌పైనే వ్యాపారం



డ్రెయినేజీపై నిర్మించిన గోడ

ప్రజాప్రతినిధుల అండదండలు

ప్రజాప్రతినిధుల అండదండలు పుష్కలంగా ఉండటంతో పాటు, అధికారులకు ఎవరి స్థాయికి తగినట్లు వారికి ముడుపులు చెల్లించడం వల్లే డ్రెయినేజీ పైనే నిర్మాణాలు చేపట్టినా ఎటువంటి చర్యలూ చేపట్టడం లేదనే ఫిర్యాదులు వినిపిస్తున్నాయి. రద్దీగా ఉండే కుండీ సెంటర్‌ నుంచి గడియార స్తంభం సెంటర్‌, పెరుగు చెట్టు నుంచి మర్చంట్‌ చాంబర్‌ కళ్యాణ మండపం వచ్చే మార్గం, శనగపప్పు బజారు నుంచి పోణంగి వెళ్లే మార్గం ఇలా అన్ని చోట్లు సమస్యలు తిష్టవేశాయి. ఎవరైనా అధికారి ధైర్యంచేసి సంబంధిత వ్యాపారులు, యజమానులకు నోటీసులిచ్చే ప్రయత్నం చేసినా స్థానిక ప్రజాప్రతినిధులు ఎంటరై సైలెంట్‌ చేసేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి.

ఫిర్యాదు చేసినా పట్టించుకోరు



రోడ్డును ఆనుకుని డ్రెయినేజీ పైనే నిర్మాణాలు చేసి వ్యాపారాలు చేస్తుండడంతో ఎన్నో ఇబ్బందులు పడుతున్నాం. దీనిపై నగరపాలక సంస్థ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. ఆక్రమణలకు ప్రజాప్రతినిధులే సహకరిస్తుంటే సమస్యను ఎవరికి చెప్పుకోవాలో తెలియని పరిస్థితి నెలకొంది. ఒక్కో సందర్భంలో ఫిర్యాదుచేసిన వారిపైనే బెదిరింపులకు దిగుతున్నారు.

– ఎండీ ఇస్మాయిల్‌ షరీఫ్‌, స్థానికుడు, వన్‌టౌన్‌, ఏలూరు

రోడ్లపైనే నిర్మాణాలు



రోడ్లపైకి వచ్చి వ్యాపారాలు చేసేవారిని, భవనాలు, గోడలు నిర్మించే వారిపైనా కార్పొరేషన్‌ అధికారులు చర్యలు తీసుకోవాలి. ఏలూరు వన్‌టౌన్‌ ప్రాంతంలో ఇరుకు రోడ్లు కావడం, ఆపైన ఆక్రమణలు పెరిగిపోవడం వల్ల తరచూ ట్రాఫిక్‌ సమస్యలు తలెత్తుతున్నాయి. కనీసం పాదచారులు, ద్విచక్ర వాహనచోదకులు రోడ్లపై నుంచి వెళ్లేందుకు ఇబ్బంది పడుతున్నారు.

– గారపాటి నాగేశ్వరరావు, జిల్లా కార్యదర్శి, వైఎస్సార్‌ సీపీ ఎస్సీ సెల్‌, ఏలూరు

ఏజెన్సీ పాఠశాలలకు మినహాయింపు ఇవ్వాలి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఏజెన్సీలో సాయంత్రం తొందరగా సూర్యాస్తమయం అవడం వల్ల విద్యార్థులు భద్రంగా ప్రయాణం చేయటం కష్టమవుతోందని, ఈ నేపథ్యంలో పైలెట్‌ ప్రాజెక్టుగా సాయంత్రం ఐదు గంటల వరకు తరగతులను నిర్వహించేందుకు ఎంపిక చేసిన పాఠశాలలను మినహాయించాలని ఏపీటీఎఫ్‌ రాష్ట్ర కార్యదర్శి బీఏ సాల్మన్‌ రాజు, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు తాళ్లూరి రామారావు, బి.రెడ్డి దొర ఒక ప్రకటనలో కోరారు. జీఓ 70 ప్రకారం ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులకు సెలవు మంజూరు చేసే అధికారం ప్రధానోపాధ్యాయులకు, ప్రధానోపాధ్యాయులకు సెలవును ఎంఈఓ, డీవైఈఓలు మంజూరు చేసే అధికారం ఉండేదని, నేడు ఉపాధ్యాయులకు, ప్రధాన ఉపాధ్యాయులకు అందరికీ ఎంఈఓ, డీవైఈఓలు సెలవులు మంజూరు చేయాలని మౌఖిక ఆదేశాలివ్వడం సరికాదని పేర్కొన్నారు. ఇటీవల జిల్లా అధికారులు మండలానికి 10 శాతం మాత్రమే సెలవు ఇవ్వాలని నిబంధనలు పెట్టడంపై పునరాలోచించాలని కోరారు. అపార్‌ నమోదులో ఇబ్బందుల కారణంగా మార్చి నెలాఖరు వరకు సమయం ఇవ్వాలని పేర్కొన్నారు.

నేడు నగరేశ్వర స్వామికి జలాభిషేకం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక అగ్రహారం నగరేశ్వర స్వామి ఆలయంలో కార్తీక మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం విశేష పూజలు చేయనున్నట్టు ఆలయ కార్యనిర్వహణాధికారి సీహెచ్‌వీ నాగమునేశ్వరరావు తెలిపారు. ఉదయం స్వామి వారికి వివిధ నదీ జలాలతో అభిషేకాలు, అనంతరం పుష్పార్చన నిర్వహిస్తారని పేర్కొన్నారు. మధ్యాహ్నం ఆలయంలో అన్నసమారాధన ఉంటుందని, సాయంత్రం స్వామి వారి ఊరేగింపు నిర్వహిస్తామని పేర్కొన్నారు. భక్తుంతా పాల్గొనాలని కోరారు.

నర్సరీలపై చర్యలకు వినతి

కుక్కునూరు: అనుమతుల్లేని నర్సరీలపై చర్యలు చేపట్టాలని కోరుతూ సోమవారం సీపీఎం నాయకులు ఆర్డీఓకు వినతిపత్రం అందించారు. మండలంలోని బంజరగూడెం, గణపవరం, ఇబ్రహీంపేట, రాయిగూడెం, అల్లిగూడెం, వేలేరు బోనగిరి తదితర గ్రామాల్లో గిరిజనులను పేరున అనుమతులు లేకుండా నర్సరీలు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. తెలంగాణ నుంచి వచ్చిన స్థానికేతరులు కొందరు వోల్టా చట్టాలని తూట్లు పొడుస్తూ బోర్లు వేయడంతో భూగర్భజలాలు అడుగంటిపోతున్నాయని, ఐనా అధికార యంత్రాంగం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఆటో కార్మికులకు పార్కింగ్‌ స్థలం కేటాయించాలని కోరారు. సీపీఎం మండల కార్యదర్శి భయ్యన శ్రీను, నాయకులు యర్రంశెట్టి నాగేంద్రరావు, యర్నం సాయికిరణ్‌, ఎండీ పుల్లు పాల్గొన్నారు.

గిరిజన చట్టాల అమలులో విఫలం

బుట్టాయగూడెం: ఏజెన్సీ ప్రాంతంలో 1/70 చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ అన్నారు. బుట్టాయగూడెం మండలం ముప్పినవారిగూడెంలో ఆ సంఘ సమావేశం బేతి కిశోర్‌ అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. వనజ మాట్లాడుతూ గిరిజన చట్టాల అమలు చేయడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని విమర్శించారు. నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య మాట్లాడుతూ ఎన్నికల హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేయాలని, ఐటీడీఏ రెగ్యులర్‌ పీఓను నియమించాలని కోరారు. పేద గిరిజనులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలన్నారు.

వైభవంగా కార్తీక సోమవారం పూజలు



చౌడేశ్వరి రామలింగేశ్వరస్వామి



నగరేశ్వరస్వామి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): కార్తీక మాసం ఆఖరి సోమవారం పర్వదినం సందర్భంగా నగరంలోని పలు శైవక్షేత్రాల్లో విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మహిళా భక్తులు ధ్వజస్తంభాల వద్ద కార్తీక దీపాలు వెలిగించారు. స్వామివారిని దర్శించుకున్నారు. పత్తేబాద చౌడేశ్వరి రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో పూర్వాషాఢ నక్షత్రంతో నిత్య పూజలు చేశారు. మహన్యాస పూర్వక అభిషేకాలు నిర్వహించారు. పవర్‌పేట కాశీ అన్నపూర్ణ సమేత విశ్వేశ్వర స్వామి దేవస్థానంలో తెల్లవారు జాము నుంచి భక్తుల గోత్రనామాలతో స్వామి వారికి రుద్రాభిషేకం చేశారు. అన్నపూర్ణ అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. సాయంత్రం స్వామి వారికి విశేష అలంకరణ, ఆకాశదీప పూజ, విశేష హారతి సేవలు చేశారు. అగ్రహారం నగరేశ్వర స్వామి ఆలయంలో ఉదయం స్వామివారికి మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, భక్తుల గోత్రనామాలతో అష్టోత్తర పూజలు నిర్వహించారు. స్వామి వారికి ప్రత్యేక అలంకరణ చేశారు. దొండపాడు శ్రీనం దత్తనాథ క్షేత్రంలో సర్వదోష పరిహారక విశ్వేశ్వర స్వామి వారికి ఉదయం మహన్యాస పారాయణ, లఘున్యాస పూర్వక ఏకవార రుద్రాభిషేకాలు చేసి అనంతరం విశేష అలంకరణ, అర్చన చేశారు. సాయంత్రం ప్రదోషకాల అర్చన, రుద్ర త్రిశతి నామార్చన, బిల్వార్చన, శివ సహస్రనామ పారాయణ చేసి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించారు. శనివారపుపేట శివాలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వ్యాయామ విద్యకు భవిష్యత్తులో అత్యధిక ప్రాధాన్యత



రిటైర్డ్‌ పీడీ సాంబశివరావును సత్కరిస్తున్న ప్రిన్సిపాల్‌ నత్తానియేలు, అధ్యాపకులు

దెందులూరు: వ్యాయామ విద్యకు, మోడ్రన్‌ ఒలింపిక్స్‌కు స్ఫూర్తి ప్రదాత అయిన హెచ్‌సీ బక్‌ సేవలు చిరస్మరణీయమని రిటైర్డ్‌ ఫిజికల్‌ డైరెక్టర్‌ ఇరుకుల పాటి సాంబశివరావు, ఏలూరు ఖోఖో, కబడ్డీ అసోసియేషన్‌ అధ్యక్షుడు అన్నారు. సోమవారం గోపన్నపాలెం ప్రభుత్వ వ్యాయామ విద్యా కళాశాలలో ప్రిన్సిపాల్‌ ఎస్‌.నత్తానియేలు అధ్యక్షతన వ్యాయామ విద్య ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన రిటైర్డ్‌ ఫిజికల్‌ డైరెక్టర్‌ సాంబశివరావు మాట్లాడుతూ వ్యాయామ విద్యకు భవిష్యత్తులో అత్యధిక ప్రాధాన్యత ఉంటుందన్నారు. విద్యార్థులు ఎంచుకున్న లక్ష్యాన్ని అధిగమించేందుకు నిరంతర సాధన, ప్రణాళికబద్ధమైన కృషి చేయాలని సూచించారు. ప్రిన్సిపల్‌ డాక్టర్‌ ఎస్‌ నత్తానియేలు మాట్లాడుతూ హెచ్‌సీ బక్‌ సేవలు స్ఫూర్తిదాయకమన్నారు. అనంతరం రిటైర్డ్‌ ఫిజికల్‌ డైరెక్టర్‌ సాంబశివరావును ప్రిన్సిపల్‌, అధ్యాపకులు, డాక్టర్‌ రత్నబాబు, సాయి, కోటి, కళాశాల సిబ్బంది సత్కరించారు.

భిక్షాటన చేయిస్తున్న తల్లులకు కౌన్సెలింగ్‌



పిల్లల తల్లులతో మాట్లాడుతున్న అధికారులు

ద్వారకాతిరుమల: శ్రీవారి కొండపై శివాలయ ప్రాంగణంలో పిల్లలతో భిక్షాటన చేయిస్తున్న తల్లులకు అధికారులు సోమవారం కౌన్సెలింగ్‌ ఇచ్చారు. చైల్డ్‌ లైన్‌, ఉమెన్‌ డెవలప్‌మెంట్‌ అండ్‌ చైల్డ్‌ వెల్ఫేర్‌, పోలీస్‌, వెల్ఫేర్‌ అండ్‌ ఎడ్యుకేషన్‌, ఎండోమెంట్‌ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో స్పెషల్‌ డ్రైవ్‌ నిర్వహించారు. పిల్లలతో భిక్షాటన చేయిస్తున్న తల్లులను స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వీరికి ఏలూరు జిల్లా చైల్డ్‌ లైన్‌ కోఆర్డినేటర్‌ వై.వెంకటరాజు, ఐసీడీఎస్‌ సూపర్‌వైజర్లు మేరీ, లక్ష్మీరాజ్యం, ద్వారకాతిరుమల సచివాలయం–2 మహిళా పోలీస్‌ లక్ష్మీ సుజనలు కౌన్సెలింగ్‌ ఇచ్చారు. బాలల హక్కులు, రక్షణ చట్టాలపై అవగాహన కల్పించారు. పిల్లలతో భిక్షాటన చేయించడం శిక్షార్హమని, భవిష్యత్తులో ఇటువంటివి పునరావృతం అయితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

యథేచ్ఛగా సారా విక్రయాలు

లింగపాలెం: మండలంలో నాటు సారా విక్రయాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. నాటు సారా తాగితే ప్రాణహాని సంభవిస్తుందని మహిళలు ఆందోళన చెందుతున్నారు. కొన్ని గ్రామాల్లో సంబంధిత శాఖ సిబ్బందికి అమ్మకందారులు ఒప్పందం ప్రకారం ముడుపులు చెల్లిస్తూ ఉండటంతో దాడులు చేయడంలేదని, దీంతో వ్యాపారం సక్రమంగానే సాగుతోందని పలువురు విమర్శిస్తున్నారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్‌ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్‌ (ఇంద్ర)	21.00	28
ఏలూరు -బీహెచ్‌ఈఎల్‌ (అమరావతి)	22.00	30
ఏలూరు - బీహెచ్‌ఈఎల్‌ (స్టార్‌ లైనర్‌ నాన్‌ఏసీ స్లీపర్‌)	22.30	22
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	27

సూపర్‌ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్‌ నంబర్‌	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు - బీహెచ్‌ఈఎల్‌	21.45	4820	31
ఏలూరు - బీహెచ్‌ఈఎల్‌	21.15	4822	30
ఏలూరు - బీహెచ్‌ఈఎల్‌ వయా కే.కోట	19.30	4796	27
ఏలూరు -బీహెచ్‌ఈఎల్‌ వయా రామచంద్రపురం	19.45	4798	31
ఏలూరు-జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	25
ఏలూరు-బీహెచ్‌ఈఎల్‌ వయా ఖమ్మం	20.30	4800	32
ఏలూరు - బీహెచ్‌ఈఎల్‌ వయా ఖమ్మం	21.00	4804	32
ఏలూరు - ఈసీఐఎల్‌	22.30	4814	27
ఏలూరు - తిరుపతి	16.00	4830	24

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	42	అరటి కాయ (1)	07-10
వంకాయలు (గులాబీ)	26	చిక్కుడు కాయలు	68
వంకాయలు (కాంతులు)	40	చామదుంపలు	48
వంకాయలు (తెలుపు)	44	ములక్కాడలు	07, 10
బెండకాయలు	32	కంద	80
పచ్చిమిర్చి	24-28	బీట్‌రూట్‌	60
కాకర కాయలు	30-40	కీరా దోస	32
బీరకాయలు	30	ఫ్రెంచ్‌బీన్స్‌	68
బీరకాయలు (పందిరి)	40	అల్లం	70
క్యాబేజీ	36	కొత్తిమీర (కట్ట)	20
క్యారెట్‌	72	పాలకూర	12
దొండకాయలు	36	చుక్కకూర	15
బంగాళదుంపలు	38	తోటకూర	10
ఉల్లిపాయలు	36-55	గోంగూర	07
గోరుచిక్కుడు	34	పుదీనా	05
దోసకాయలు	24-28	బఠాణీ	--
ఆనపకాయ (1)	20-25	క్యాప్సికమ్‌	--
పొట్లకాయ(1)	20-25	చిలకడదుంప	--

ధాన్యం నిల్వ.. అధిక ప్రయోజనకరం

- క్రిమికీటకాలు దరి చేరకుండా చేయడమే ప్రధానం
- ఆశించిన గిట్టుబాటు ధరకు విక్రయించుకునే అవకాశం

దెందులూరు: ఆరుగాలం శ్రమించి, అడ్డంకులను అధిగమించి ఖరీఫ్‌ సాగు పూర్తి చేసిన అన్నదాతలకు ధాన్యానికి గిట్టుబాటు ధర అందడం లేదు. దీంతో ధాన్యాన్ని భద్రపరచుకోవడంపై కొందరు రైతులు దృష్టి సారించారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఈ ప్రక్రియ రైతులకు పెనుసవాలుగా మారింది. పండించిన ధాన్యాన్ని వెంటనే విక్రయించడం వల్ల కొంత మంది మిల్లర్లు తేమ అధికంగా ఉందంటూ ధరలో కోత విధించడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఏర్పడింది. రాష్ట్ర ప్రభుత్వం రైతులను పూర్తిస్థాయిలో ఆదుకునేందుకు అంతగా చర్యలు తీసుకోకపోవడంతో పాటు అక్కడక్కడా దళారుల బెడద వల్ల పండించిన ధాన్యానికి సరైన గిట్టుబాటు ధర రావడం లేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. రైతులకు ధాన్యం నిల్వ చేసుకునేందుకు అవసరమైన గోదాములు లేకపోవడంతో మెజార్టీ రైతులు తమ పంట ఉత్పత్తులను వెంటనే విక్రయించడం పరిపాటిగా మారింది. దీంతో రైతులందరూ ధాన్యాన్ని మిల్లర్లకు విక్రయించుకున్న తరువాత ధర పెరగడం ప్రతి సీజన్‌కు నిత్యకృత్యమైంది. ఈ సమస్యలను అధిగమించేందుకు ధాన్యం నిల్వ చేసుకుని సరైన సమయంలో విక్రయిస్తే రైతులకు అధిక ప్రయోజనాలతో పాటు గిట్టుబాటు ధర దక్కుతుందని రైతులు అభిప్రాయపడుతున్నారు. ఈ ఖరీఫ్‌ సీజన్‌ ప్రారంభ నుంచి రైతులు పలుమార్లు ప్రకృతి వైపరీత్యాల కారణంగా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. నియోజకవర్గంలోని అనేక ప్రాంతాల్లో వరదల కారణంగా వరి నాట్లు మునిగిపోవడంతో రైతులు నారు కొనుగోలు చేసిన రెండోసారి నాట్లు వేసి సాగు కొనసాగించారు. తెగుళ్ల నివారణకు పెట్టుబడి అధికమైంది.



దెందులూరులో తేమ శాతాన్ని తగ్గించేందుకు ధాన్యం ఆరబోసిన రైతులు

ధాన్యంలో తేమ శాతాన్ని తగ్గించుకోవాలి

సాధారణంగా వరి కోతల సమయంలో ధాన్యం సుమారు 20 శాతం వరకూ తేమ ఉంటుంది. ధాన్యాన్ని ఆరబెట్టడం ద్వారా తేమ శాతాన్ని ఐదు వరకూ తగ్గించుకోవచ్చు. ధాన్యంలో సుమారు 14 శాతం మించి తేమ ఉంటే బూజు పట్టే అవకాశాలు ఎక్కువ. ఆ పరిస్థితులు లేకుండా రైతులు ధాన్యాన్ని ఆరబెట్టే సమయంలో అప్రమత్తంగా వ్యవహరించాలి. క్రిమికీటకాలు, ఎలుకల బారిన పడకుండా పంటను సురక్షిత ప్రాంతాల్లో నిల్వ చేసుకుని ధాన్యాన్ని సంరక్షించుకోవాలి. ధాన్యం నిల్వ చేసుకునే రైతులు వ్యవసాయశాఖ సూచనల మేరకు తగిన జాగ్రత్తలు తీసుకుని నియమాలు పాటిస్తే క్రిమికీటకాల నుంచి పంట ఉత్పత్తిని రక్షించుకోవచ్చు.

కొద్దికాలం నిల్వ చేస్తే రైతుకు లాభం

పండించిన ధాన్యాన్ని ఆరబెట్టి కొద్దికాలం నిల్వ చేస్తూ కనీస జాగ్రత్తలు పాటిస్తే రైతులు మంచి ప్రయోజనాలు పొందే అవకాశం ఉందని వ్యవసాయశాఖ జిల్లా అసిస్టెంట్‌ డైరెక్టర్‌ వై. సుబ్బారావు చెబుతున్నారు. రైతులు ధాన్యం నిల్వ చేసుకునే సమయంలో కొన్ని జాగ్రత్తలు పాటిస్తే నష్టం అనే ప్రశ్న ఉత్పన్నం కాదని ఆయన అన్నారు. ఖరీఫ్‌ ధాన్యానికి మరింత గిట్టుబాటు ధరను రాబట్టుకునేందుకు ధాన్యాన్ని నిల్వ చేసుకునేందుకు అనేక మంది రైతులు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఒక వేళ నిల్వ చేసుకోవడంలో ఏ మాత్రం నిర్లక్ష్యం వహించినా ధాన్యం తీవ్రంగా దెబ్బతినే అవకాశం ఉంది. ధాన్యాన్ని నూర్చిన తరువాత ఇంటి అవసరాలు, విత్తనాల కోసం ఆరు నెలల నుంచి ఏడాది పాటు భద్రపరుచుకోవాలి.

ఎలుకల బెడద ప్రధాన ఆటంకం

ధాన్యాన్ని నిల్వ చేసుకునే సమయంలో ఎలుకల నివారణమే ముఖ్యంగా భావించాలి. ధాన్యం గిడ్డంగుల చుట్టూ చెత్త, చెదారం లేకుండా తరచూ శుభ్రం చేయాలి. వివిధ రకాల బోనులు, బుట్టలు ఉపయోగించి ఆ ప్రాంతంలోకి ఎలుకల రాకుండా జాగ్రత్తలు పాటించాలి. ధాన్యం గిడ్డంగుల తలుపుల కింది భాగంలో జింక్‌ రేకులను అమర్చాలి. తీగలు, మెస్‌ లాంటి పరికరాలు అమర్చి గిడ్డంగులకు ఏర్పడిన రంధ్రాలను మూసివేయాలి. ఇటువంటి జాగ్రత్తలు పాటిస్తే ధాన్యాన్ని ఎక్కువ రోజులు నిల్వ చేసుకునే అవకాశం ఉంటుంది.

ధాన్యం నిల్వకు ఈ జాగ్రత్తలు మేలు

నిల్వ చేసుకునే ధాన్యాన్ని నష్టపరిచే క్రిమికీటకాల పట్ల రైతులు తగిన జాగ్రత్తలు పాటించాలి. నిల్వ చేసుకునే ధాన్యానికి ముక్కు పురుగు, నుసి పురుగు, వడ్లచిలుక తదితర కీటకాలు ఎక్కువగా ఆశించి పట్టి పీడిస్తుంటాయి. వాటి నుంచి ధాన్యాన్ని రక్షించుకునేందుకు రైతులు చర్యలు తీసుకోవాలి.

ధాన్యం నిల్వ చేసే పద్ధతి



రైతులు తక్కువ ధాన్యం నిల్వ చేసుకునేందుకు సిమెంటు, వెదురు, లోహపు గాదెలను వినియోగించుకోవచ్చు. ఎక్కువ ధాన్యాన్ని నిల్వ చేసుకోవాలనుకుంటే గోదాములు, గిడ్డంగులు, సిమెంట్‌ కాంక్రీట్‌ గదులను ఉపయోగించుకుంటే పూర్తి రక్షణ ఉంటుంది. క్రిమికీటకాలు, తేమ, వర్షపు నీరులోనికి రాకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలి. ఎలుకలు ప్రవేశించే కన్నాలు ఉంటే గాజుపెంకులు ఉంచి సిమెంట్‌తో మూసివేయాలి. ధాన్యాన్ని నిల్వ చేసుకునే సమయంలో కొత్త గోనె సంచులను వినియోగించాలి. తొలుత గోనె సంచుల లోపల, బయట మలాథియాన్‌ లేదా ఎండో సల్ఫాన్‌ ద్రావణాన్ని పిచికారీ చేయాలి. మరుసటి రోజు ఆ గోనె సంచులను ఎండలో పెట్టిన అనంతరం ధాన్యాన్ని నింపాలి.

– వై. సుబ్బారావు, వ్యవసాయశాఖ ఏడీ